క్లుప్తంగా

24న చలో ఢిల్లీ



మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

కర్నూలు(సెంట్రల్): రవాణా రంగం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 24వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సరుకు, ప్రజా రవాణా ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు సమకూర్చే రవాణా రంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. లారీల డ్రైవర్లు, క్లీనర్ల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.రాధాకృష్ణ, దివాకర్ పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఓ పరీక్షకు 583 మంది గైర్హాజరు

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 16వ తేదీన జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్షలకు 583 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని జీ పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఐడీజెడ్, ఎమ్మిగనూరు సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 1250 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 667 మంది మాత్రమే హాజరయ్యారు.

18న డప్పు కళాకారుల చలో విజయవాడ


మాట్లాడుతున్న ఎండీ ఆనంద్‌బాబు

కర్నూలు(సెంట్రల్): డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 18న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో కాటికాపరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌జే కృష్ణ, డప్పు కళాకారుల సంఘం కర్నూలు, కల్లూరు మండలాల కార్యదర్శులు జి.వెంకటేష్, ఎన్ చక్రపాణి, కర్నూలు నగర నాయకులు దస్తగిరితో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు టీడీపీ నేతలు డప్పు కళాకారుల పెన్షన్లను తొలగిస్తున్నారని, వాటిని నిలుపుకోవడానికి రూ.10 వేల వరకు లంచాలు ఇచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డప్పు కళాకారుల పెన్షన్లను తొలగిస్తే తిరగబడతామని హెచ్చరించారు.

బొలెరో ఢీకొని స్కూటరిస్ట్‌కు తీవ్రగాయాలు

సి.బెళగల్: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సి.బెళగల్‌కు చెందిన తెలుగు రవి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గ్రామంలోని క్రిష్టదొడ్డి రోడ్డులో చేపల ఫ్రై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే రవి ఆదివారం చేపలను తీసుకుని స్కూటర్‌పై దుకాణానికి వెళ్తుండగా, బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వాసు బొలెరో వాహనంలో వస్తూ ఢీకొట్టాడు. ప్రమాదంలో స్కూటర్ పూర్తిగా ధ్వంసంకాగా తెలుగు రవి తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడిని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి ఫిర్యాదు చేశారు. పాత కక్షలను మనుసులో పెట్టుకొని వాసు ఉద్దేశపూర్వకంగా తనను వాహనంతో ఢీకొట్టి అక్కడి నుంచి పరారైనట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. ఘటనపై ఎస్ఐ తిమ్మారెడ్డిని వివరణ కోరగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డుకు పన్ను!

● మున్సిపల్ అధికారుల తీరిది ● నగరపాలక సంస్థ లీలలు


మున్సిపల్ అధికారులు పన్ను వేసిన రోడ్డు ఇదే

కర్నూలు (టౌన్): ఎక్కడైన ఇళ్లకు పన్ను వేస్తారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే నగర పాలక సంస్థ అధికారులు మాత్రం రోడ్డుకు పన్ను వేశారు. నోటీసులు జారీ చేశారు. తీరా ఇంటి కోసం వెతికితే అది కాస్తా రోడ్డుగా కనిపించింది. ఈ రోడ్డుకు రూ.14,636 పన్ను బకాయిలు చెల్లించాలని పేర్కొనడం విశేషం. వింతగా ఉన్నా.. ఇది వాస్తవమే.. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నగర పాలక సంస్థ పరిధిలో నివసించే వారు పన్ను వేయాలంటే తప్పనిసరిగా సదరు ఇంటి యజమాని ఇంటి డాక్యుమెంటు, లింకు డాక్యుమెంటు, ఇంటి ఫొటో, ఆధార్ కార్డు ఇలా.. తప్పనిసరిగా రెవెన్యూ విభాగంలో సమర్పించాల్సి ఉంటుంది. ఈ డాక్యుమెంటు ఉంటేనే వెరిఫికేషన్ చేసిన తరువాత ఆస్తి పన్నును జారీ చేస్తారు. ఇవేవి లేకుండా నగరంలోని 45వ వార్డు అశోక్‌నగర్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి నగర్‌లో ఇంటి నంబర్ 45/24–ఆర్–30–ఎన్–53 కి అసెస్‌మెంటు నంబర్ 1016055715 యజమాని ఏలియా పేరుతో పన్ను రశీదు ఉంది. 2004 సంవత్సరం నుంచి 2025 సంవత్సరం వరకు ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని మున్సిపల్ అధికారులు తిరుగుతున్నారు. ఇళ్లు మాత్రం కనిపించడం లేదు. రోడ్డు తప్పా.. వాస్తవానికి ఒక వైపు వార్డు పరిధిలో సచివాలయాలు ఉన్నాయి. 100 ఇళ్లకు సచివాలయాల సిబ్బంది ఉంటారు. వారంతా అదే ఏరియాలో తిరుగుతున్నారు. 20 సంవత్సరాలుగా పన్ను బకాయిలు ఉంటే ఏం చేస్తున్నారు. విచారణ చేశారా..? వాస్తవాలు తెలుసుకోవాలి. అసలు ఉన్నారా.. లేదా.. ఇళ్లు లేకుంటే ఆ పన్ను ఎలా జనరేట్ చేశారు. ఎవరూ పన్ను చెల్లించాలి.

శాటిలైట్ ద్వారా కొలతలు అంటే ఇదేనా?

ఒకవైపు శాటిలైట్ ద్వారా కొలతలు వేస్తున్నాం అంటున్నారు. ఇదేనా.. కనిపించని ఇంటి కోసం పన్ను వేశారు. ఇప్పుడు పన్నులు చెల్లించాలంటూ తిరుగుతున్నారు. ఇదేం విడ్డూరం. వార్డు పరిధిలో మూడు సచివాలయాలు ఉన్నాయి. తప్పులు లేకుండా చూడాల్సిన భాద్యత సచివాలయాలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై ఉంది. అయినా పొరపాట్లు జరగడం విడ్డూరంగా ఉంది.

– టీ.రాముడు, సీపీఎం మాజీ కార్పొరేటర్

ఆ నేతలిద్దరూ అవకాశవాదులే..


మాట్లాడుతున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముందు వరుసలో లబ్ధి పొందిన విజయ సాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి వారి స్వప్రయోజనాల కోసం ఏ పార్టీకైనా, ఏ నాయకుడికైనా వెన్నుపోటు పొడుస్తారు. అవకాశవాదానికి ప్రతిరూపాలు వీరిద్దరూ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. ఆదివారం స్థానిక సి.క్యాంపులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలో, పదవుల్లో విజయసాయిరెడ్డికి, బాలినేనికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పార్టీని వీడిన కొద్ది రోజుల్లోనే వారిద్దరూ అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. అధికారంలో ఉన్న సమయంలో మూడు నాలుగు సంవత్సరాలుగా అవమానించబడ్డామని చెబుతున్న వారు అప్పట్లోనే పార్టీని ఎందుకు వీడలేదని ప్రశ్నించారు? ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి నేతల మెప్పు కోసమే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్న విషయం ప్రజలందరికీ అర్థమైందన్నారు. పదవీకాంక్ష లేకుండా పార్టీ కోసం, జగనన్న కోసం, ప్రతి నిత్యం పనిచేస్తున్న పార్టీ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డిపై అసూయతో నిందలు మోపడం సరికాదన్నారు.

పేరుకుపోయిన చెత్తను తొలగించాలి


ప్రజా చైతన్య యాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: నగరంలోని వీధులలో చెత్త సేకరణ చేస్తూ ఆగిపోయిన వాహనాలను మళ్లీ వినియోగంలోకి తేవాలని సీపీఎం నగర కమిటీ సభ్యుడు యేసు, హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు అర్బన్ 31వ వార్డు పరిధిలోని రాఘవేంద్ర నగర్, సాయి నగర్, బద్రీనాథ్ నగర్, స్వామి నగర్ ప్రాంతాలలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. గత నెల రోజుల నుంచి నగరంలోని కాలనీల్లో చెత్త సేకరణ బండ్లు రాకపోవడంతో చెత్తంతా పేరుకుపోయిందన్నారు. చెత్తను డ్రైనేజీలలో వేస్తుండటంతో పూడికతో నిండిపోతున్నాయన్నారు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల నుంచి వివిధ రకాలు పన్నులు వసూలు చేస్తున్నారు తప్ప సేవలు అందించడం లేదని విమర్శించారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలసి ఆందోళనకు దిగుతామన్నారు. సీపీఎం నాయకులు శ్రీనివాసులు, మహేంద్ర, మౌలాలి, రాజు, అయ్యస్వామి, గణేష్, అశోక్, అంజి, మహేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి


మాట్లాడుతున్న సి.గురు శేఖర్

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రజకులకు ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు, కల్లూరు మండలాల కమిటీల సంయుక్త సమావేశాన్ని చాకలి ఐలమ్మ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజక కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించి 90 శాతం సబ్సిడీతో రజక యువతకు రూ.5 లక్షల రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో దోబీ ఘాట్లను ఏర్పాటు చేయాలని, జీఓ నంబర్ 6 ప్రకారం కలెక్టర్ చైర్మన్‌గా రజక సంక్షేమ కమిటీలను ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలన్నారు. ఇళ్లు లేని రజకులకు ఇంటి స్థలం ఇవ్వాలని, విశ్వకర్మ కౌసల్య యోజనలో వడ్డీ లేని రుణాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శేక్‌బాబు, సి.రాముడు, సుంకన్న పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి


చిల్డ్రన్స్ పార్కులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా తదితరులు

కర్నూలు(అర్బన్): అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారతరత్న వచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగరంలోని చిల్డ్రన్స్ పార్కు, చిన్న అమ్మవారి శాల ప్రాంతాల్లోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజలందరూ నిత్యం స్మరించుకోదగిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తన జీవితాన్నే త్యాగం చేశారని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన మంత్రి టీజీ భరత్ ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ బీ.నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీలు సుంకన్న, కేఈ సుభాషిణి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): నగరపాలక కార్యాలయంలో కమిషనర్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఎంఈ సత్యనారయణ, మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామక్రిష్ణ, వాజిద్ పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డీవీ సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఎస్.ప్రమీల, తదితరులు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నందున ఈ నెల 17న కర్నూలులోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు. జిల్లా పరిషత్ నుంచి కిడ్స్ వరల్డ్ పార్క్ వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నగరపాలకలో నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలపై అర్జీలు అందజేయవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని సూచించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నేడు ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది విధుల బహిష్కరణ

కర్నూలు(హాస్పిటల్): డిమాండ్ల సాధనకై రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)లో పనిచేస్తున్న వైద్యమిత్రలు ఈ నెల 17వ తేదీన విధులు బహిష్కరించనున్నట్లు ఏపీ వైద్యసేవ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సి.కంబరి, ఉపాధ్యక్షుడు జి.రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము 17 సంవత్సరాలుగా ఎన్టీఆర్ వైద్యసేవ/ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్నామని, సమస్యల పరిష్కారం కోసం అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. అందుకే ఈ నెల 17, 24 తేదీల్లో (రెండు సోమవారాలు) జిల్లాలోని వైద్యసేవ జిల్లా సమన్వయాధికారి కార్యాలయం వద్ద నిరసనలు, 27వ తేదీన ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్(మంగళగిరి)లో గాంధేయ పద్ధతుల్లో శాంతియుతమైన నిరసనలు తెలపాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

రోగులకు బ్రెడ్లు పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): తన పుట్టిన రోజును పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ఆదివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎంఎం–3, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో రోగులకు బ్రెడ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. అంతకుముందు అనాథ శరణాలయంలో వృద్ధులకు పండ్లు అందజేశారు. వైద్యులు హర్ష, సుధీర్, వినీత, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, ప్రధాన కార్యదర్శి సూర్య తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

కర్నూలు (టౌన్): నేటి సమాజంలో మహిళలు సైతం మార్షల్ ఆర్ట్స్, కరాటేలో రాణించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. స్థానిక కొత్తపేటలోని బాలశివ జూనియర్ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రతిభ చాటిన క్రీడాకారులకు కరాటే బెల్టులు, సర్టిఫికేట్లు, టోపీలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్‌లో యోగా, ధ్యానం, ప్రాణాయామం వల్ల విద్యార్థులకు దైనందిన జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

24, 25 తేదీల్లో అన్నదానం

కర్నూలు(అగ్రికల్చర్): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలానికి కాలినడకన వెళ్లే కర్ణాటక భక్తుల కోసం ఈ నెల 24, 25 తేదీల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, జయచంద్రరెడ్డి తెలిపారు. కర్నూలు అబ్బాస్ నగర్‌కు చెందిన ఈ సంఘం సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతోందని, ఇందులో భాగంగానే సంఘంలోని సభ్యుల సహకారంతో రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానిక నందికొట్కూరు రోడ్డులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా అన్నదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా లలితాదేవి మహోత్సవం


కోలాటం ఆడుతున్న మహిళలు


లలితా దేవికి పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు శ్రీమాతా సత్సంగం ఆధ్వర్యంలో లలితాదేవి మహోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం నగర శివారులోని కేఎస్ఆర్ కన్వెన్షన్‌లో లలితా దేవి మహోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, లలిత సహస్రనామ పారాయణం, సౌందర్యలహరి పారాయణం, సామూహిక పూజలు, ధార్మిక సంస్థల కోలాటాలు, భజనలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. లలితా దేవి నామస్మరణ మార్మోగింది. లలితా పీఠం పీఠాధిపతులు గురు మేడా సుబ్రహ్మణ్యం సందేశమిచ్చారు. శ్రీ మాతా సత్సంగం అధ్యక్షులు శ్రీదేవి, సభ్యులు, లలితా పీఠం సభ్యులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అంజన్నకు కాటసాని పూజలు


పూజల్లో పాల్గొన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ 32వ వార్డు పరిధిలోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆలయ ధ్వజ స్తంభ పునఃప్రతిష్టతోపాటు నవగ్రహ, కుమార స్వామి, దత్తాత్రేయ స్వాముల ప్రతిష్ఠోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని, కార్పొరేటర్ శ్రీనివాసులును శాలువాతో సత్కారించారు.

'దుర్వాసన వస్తున్నా పట్టించుకోవడం లేదు'


పీపీఎస్ఎస్ నాయకులతో గోడు వెల్లబోసుకుంటున్న వృద్ధురాలు

కర్నూలు(సెంట్రల్): ఇంటి ముందు కాలువ పాడవడంతో మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ రెడ్డి కాలనీకి చెందిన వృద్ధురాలు పౌర పట్టణ సంక్షేమ సంఘం నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కాలువను నిర్మించాలని పలుమార్లు మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఆదివారం పీపీఎస్ఎస్ నాయకులు బీఆర్ రెడ్డి కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓ వృద్ధురాలు మాట్లాడుతూ.. మురుగు కాలువలు పాడైపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, అనారోగ్యం బారిన పడినా ఎవరూ పట్టించుకోవడం లేదని, పాములు, తేళ్లు, విషపురుగులు ఇంట్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రోడ్డుపైనే మురుగు నీరు ప్రవహిస్తోందన్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు యూనస్, సీవీ వర్మ, అన్వర్‌బాషా, అంజి, రామాంజనేయులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' ఎప్పుడిస్తావు బాబూ?


వీకర్ సెక్షన్ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా సూపర్ సిక్స్ పథకాల అమలు ఏదని సీపీఎం నాయకులు సీఎం చంద్రబాబునాయుడును ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జొహరాపురం 18వ వార్డులో ఓల్డ్‌సిటీ నగర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు విజయ్, రామాంజనేయులు, వీకర్ సెక్షన్ కాలనీ 37వ వార్డు పరిధిలో న్యూసిటీ నగర కార్యదర్శి టి.రాముడు, సభ్యులు శ్యామల, రహిమాన్, జమ్మన్న, అబ్దుల్లా, గుర్రప్ప తదితరులు ప్రజా చైతన్యయాత్రలు చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. నగరంలో చెత్త కుప్పలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా కర్నూలు నగర పాలక సంస్థ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శివారు కాలనీలకు మంచినీరు సరఫరా కావడం లేదన్నారు. డ్రైనేజీలు పాడవడంతో రోడ్లపైనే మురుగునీరు పారుతోందన్నారు.

హలీం ఘుమఘుమలు


నగరంలో హలీం విక్రయాలు


వడ్డించేందుకు సిద్ధం చేసిన హలీం

రంజాన్ మాసంలో నగరంలో ఎటు చూసినా హలీం ఘుమ ఘుమలు కనిపిస్తున్నాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాలు, హోటళ్ల వద్ద మటన్, చికెన్ హలీంను తయారు చేసి విక్రయిస్తున్నారు. కఠిన ఉపవాసాలు చేసే సమయంలో ప్రార్థనల అనంతరం బలవర్ధక ఆహారమైన హలీంను ముస్లింలు ఇష్టంగా స్వీకరిస్తున్నారు. అలాగే నగరవాసులు రుచికరమైన హలీంను తినేందుకు మొగ్గు చూపుతుండటంతో డిమాండ్ పెరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 వరకు ఆయా హలీం దుకాణాలు జనంతో కళకళలాడుతున్నాయి. రకాలను బట్టి మటన్ హలీమ్ ఒక ప్లేటు రూ.270, చికెన్ హలీమ్ ప్లేటు రూ.150 వరకు ఉంటోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


హలీంను ఆరగిస్తున్న నగరవాసులు

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : ఛావా, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, దిల్‌రుబా, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, ఆఫీసర్ ఆన్ డ్యూటీ, యుగానికి ఒక్కడు (2010)
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : యుగానికి ఒక్కడు (2010), కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, ఆఫీసర్ ఆన్ డ్యూటీ, దిల్‌రుబా, తండేల్, మజాకా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఛావా, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, దిల్‌రుబా
శ్రీరామ : ఛావా
రాజ్ : యుగానికి ఒక్కడు (2010)
భరత్ కాంప్లెక్స్ : తండేల్, 1000 వాలా
విజయ థియేటర్ , మజాకా
విక్టరీ టాకీస్ : మజాకా